క్లుప్తంగా

సాగునీటి కాలువల మరమ్మతులకు వినతి



విజయసాయిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పేరయ్య

బల్లికురవ: సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరందించేందుకు తక్షణమే కాలువలకు మరమ్మతులు చేయించాలని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య విన్నవించారు. గురువారం తాడేపల్లిలోని రాజ్యసభ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని పేరయ్యతో పాటు మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ దివ్యా రామాంజనేయులు రైతుల సమస్యలపై చర్చించారు. పంటలన్నిటికీ గిట్టుబాటుతో దళారుల బెడద లేకుండా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయించాలని ఆయన కోరారు.

కృష్ణచైతన్యను కలిసిన సాహిత్య అకాడమీ డైరెక్టర్



చైతన్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భువనేశ్వరి

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన కొల్లా భువనేశ్వరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. తనకు పదవి ఇప్పించడంలో కృషిచేసిన చైతన్య, పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్యకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

చీరాల అర్బన్: గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని లైబ్రేరియన్ డీ ధనమ్మ పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆటలు, నీతి కథలు, పదవినోదం, మైండ్ గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఈనెల 11న బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జేవీపాలెం ఉప సర్పంచ్‌గా చంద్రమ్మ



నియామకపత్రం తీసుకుంటున్న చంద్రమ్మ

కారంచేడు: మండలంలోని జరుబులవారిపాలెం గ్రామ ఉపసర్పంచ్‌గా తెలగతోటి చంద్రమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఉప సర్పంచ్‌గా విధులు నిర్వహించిన బండారు సుధారాణి వ్యక్తిగత కారణాలతో గత ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. దీంతో అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ పదవిలో చంద్రమ్మను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ వ్యవహరించి నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాసు కుమారి, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, పాలకవర్గం పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

బల్లికురవ: సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులంతా బాధ్యతలు గుర్తెరిగి పనిచెయ్యాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఉప్పుమాగులూరు–2 సచివాలయాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తహసీల్దార్ కోరారు. తనిఖీలో పంచాయతీ సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది

- 20 ఏళ్ల నిరీక్షణకు తెర
- సంతోషం వ్యక్తం చేసిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



ఈపూరుపాలెంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కారంచేడు: ఎన్నో ఏళ్ల నిరీక్షణ.. గత ప్రభుత్వం వట్టిమాటలతో వారిని మభ్యపెట్టి వెట్టిచాకిరి చేయించుకుంది. కనీసం గుర్తింపు కూడా ఇవ్వకుండా గాలికి వదిలేసింది. దీంతో కుటుంబాలు నాటి నుంచి ఆవేదనతో అప్పులతో కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ఆనాడు ప్రతిపక్షనేత జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ద్వారా అనేక మంది ఉద్యోగుల భావోద్వేగాలు, కష్టాలు, ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో మనందరి ప్రభుత్వం వచ్చిన తరువాత మీ అందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిన జగన్ సీఎం అయిన తరువాత వారి కష్టాలను తీర్చాడు. మంగళవారం నిర్వహించిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో సుమారు 10 వేల మందికి పైగా వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులకు ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. జగనన్న ఇచ్చిన మాటకు నిలబెట్టుకొనేలా హామీని నెరవేర్చుతున్నందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. సీఎం సార్ ఇదుగో.. మా సెల్యూట్ అంటూ భావోద్వేగాలకు గురవుతున్నారు.

సీఎం జగన్ మోహన్‌రెడ్డికి సెల్యూట్..



నేను వైద్య, ఆరోగ్యశాఖలో 2001 నుంచి కారంచేడు మండలం స్వర్ణ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాను. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వేల మంది ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహించారు. ఎన్నో సార్లు ప్రభుత్వ పెద్దలను కలసి రెగ్యులర్ చేయాలని కోరాం. రోడ్లు ఎక్కాం, ధర్నాలు చేశాం. ఏ ఒక్కరూ మా మొర ఆలకించలేదు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొంత మందికి రెగ్యులర్ చేశారు. ఇప్పుడు మిగిలిన ఉద్యోగులను ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేయడానికి కేబినెట్ ఆమోదంతో సంతోషంగా ఉంది. ఈసందర్భంగా సీఎం జగన్‌కు సెల్యూట్ చేస్తున్నాం.

– బయ్యా శంకర్, ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం జగనన్నకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం..



నేను 2002 నుంచి కొరిశపాడు మండలం ప్రాసంగులపాడు పీహెచ్‌సీలో గ్రేడ్–2 ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాను. 22 ఏళ్ల మా సర్వీస్‌లో ఎన్నో కష్టాలు పడ్డాం. ఉద్యోగ భద్రత కోసం ఎన్నో పోరాటాలు చేశాం. ఎంతో మంది పాలకులు, ఉన్నతాధికారులను కలిశాం. అప్పులు చేసి మా బాధ్యతలు నిర్వహించాం. కాని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. నేను ఉన్నాను.. నేను విన్నాను అనే ఒకే ఒక్క మాటతో మాకు ఎంతో నమ్మకం ఇచ్చిన జగనన్న నేడు మాకు దేవుడయ్యాడు. మాకు మాటలు కూడా రావడం లేదు. థాంక్యూ సీఎం సార్.

– కే ప్రశాంతి, ల్యాబ్ టెక్నీషియన్, ప్రాసంగులపాడు పీహెచ్‌సీ

ఇది ఒక చారిత్రక నిర్ణయం..



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రకం. నేను 2003 నుంచి ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎంపీహెచ్‌ఏ మేల్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మా ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని అనేకసార్లు తిరిగాం. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో మాలాంటి ఎన్నో వేల మంది కుటుంబాల్లో వెలుగులు నింపారు. మేము ఇక నుంచి కడుపునిండా తినడానికి అవకాశం ఇచ్చాడు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– జేబీవీ కృష్ణమూర్తి, ఎంపీహెచ్‌ఏ, ఈపురుపాలెం పీహెచ్‌సీ

అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎంపీపీ, భక్తులు

స్వర్ణ (కారంచేడు): గ్రామస్తుల సహకారంతో నెలకొల్పిన 72 అడుగుల ఎత్తు అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను కన్నుల పండువగా నిర్వహించారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు దంపతులు విగ్రహావిష్కరణలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని స్వర్ణ వాటర్ ట్యాంక్ సమీపంలో గ్రామస్తులందరూ కలసి సుమారు రూ.1 కోటి విలువ చేసే ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు, భజనల కోసం మందిరం నిర్మాణం చేపట్టారు. వేదపండితులు, రుత్విక్కుల మంత్రోచ్చరణల మధ్యన దివ్య కుంబాభిషేక ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 10 వేల మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో కారంచేడు, చీరాల, ఇంకొల్లు, పర్చూరు మండలాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కొనుగోలు కేంద్రాలు రైతులకు వరం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: పండించిన పసుపు కొమ్ములకు మద్దతు ధరను కల్పించే వరప్రదాయనిగా కొనుగోలు కేంద్రాలు నిలుస్తాయని, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఆయన గురువారం పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఏనాడూ రైతును పట్టించుకోలేదన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులు అడిగిన ధరకు అమ్మి నష్టపోయారన్నారు. నేడు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలతో గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని చెప్పారు. పసుపు కొమ్ములను మణికేశ్వరం గ్రామ కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ.6,850 విక్రయించుకోవచ్చని చెప్పారు. ఒక్కో రైతు 30 క్వింటాళ్ల వరకు అమ్ముకోవచ్చన్నారు. అవకాశాన్ని పసుపు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ సోమా శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఈదా శ్రీనివాసరెడ్డి, గుడిపూడి బ్రహ్మయ్య, కొల్లి వెంకట్రావు, సొసైటీ సీఈవో ఉమర్ రహీమ్, మందా నాగయ్య, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి..

జే.పంగులూరు: మండల పరిధిలోని జాగర్లమూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పెరుమాళ్ల రామాంజినేయులు బుధవారం అనారోగ్యంతో చనిపోయాడు. గురువారం మృతుడి కుటుంబ సభ్యులను కృష్ణచైతన్య పరామర్శించి వారికి ఆర్థిక సాయం చేశారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు గ్రామ నాయకులు నాగేశ్వరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి ఆమంచి పరామర్శ



సాంబయ్యను పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

యద్దనపూడి: ఇరువర్గాల దాడిలో గాయపడి కోలుకుంటున్న చింతపల్లిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సాంబయ్యను నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం పరామర్శించారు. అనంతరం మండలంలోని యనమదలలో జైభీమ్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమంచితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు మారెళ్ల శ్రీధర్, యనమదల సర్పంచ్ రాయి పృథ్వీరాజ్, మండలం శ్రీనివాసరావు, కుంచెపు నాగేశ్వరరావు, జంగా ఏలియా, మువ్వల రాంబాబు,కోడూరి నాగరాజు, తూబాటి వెంకటేష్, దూళిపాళ్ల వేణు ఉన్నారు.

మండలాభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి): నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ–2 పాలెపోగ రమాదేవి ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటుపడుతోందని, అదే విధంగా నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): జగనన్న పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆరోరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. రాబోయో ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉండాలన్నారు. జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్పొరేషన్ డైరెక్టర్, సొసైటీ అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్తులు ఐక్యతతో జీవించాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రభాకర్

బల్లికురవ: గ్రామాల్లోని ప్రజలంతా ఐక్యతతో కలిసిమెలసి ప్రశాంతంగా జీవించాలని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ కోరారు. గురువారం సాయంత్రం గ్రామదర్శినిలో భాగంగా మండలంలోని కొప్పరపాడు గ్రామం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో ప్రజలతో మాట్లాడారు. చట్టాలు, పోలీసు కేసులపై అవగాహన కల్పించారు. చిన్న వివషయాలను సైతం ఒకరిపై ఒకరు పరస్పర కేసులు నమోదు చేసుకోవటం వల్ల ఎంతో విలువైన సమయం, డబ్బు వృథా అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై వీ. వేమన పాల్గొన్నారు.

ఇత్తడి మండపం బహూకరణ



మండపాన్ని అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

అద్దంకి: నగర దేవత పోలేరమ్మ తల్లికి వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల విలువైన ఇత్తడి మండపాన్ని అందజేశారు. దీనిలో భాగంగా వూటుకూరి ఉమా అన్నపూర్ణ ఇంటి వద్ద నుంచి మండపాన్ని ఊరేగింపుగా తీసుకుని వెళ్లి దేవస్థానంలో అప్పగించారు. క్లబ్ అదే విధంగా ఆర్టీసీ బస్టాండు బయటి గేటు వద్ద ఆంజనేయ ట్రేడర్స్ దుకాణం ముందు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలను క్లబ్ గవర్నర్ అన్నపూర్ణ అధికార పర్యటనలో భాగంగా చేశారు. ఆయా కార్యక్రమాల్లో సెక్రటరీ గ్రంధి నాగరాజకుమారి, ట్రెజరర్ బైసాని అనంత సుజాత, జాయింట్ ట్రెజరర్ రాధిక, రీజనల్ సెక్రటరీ పబ్బిశెట్టి దీపక్, డిస్టిక్ కో ఆర్డినేటర్ అయితా రాజా, జోన్ చైర్మన్ ఎం అరవింద లక్ష్మి, ప్రసిడెంట్ ఆత్మకూరి శిరీష, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సంస్కృతం అభ్యసించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రామచంద్రరావు

అద్దంకి రూరల్: విద్యార్థి దశనుంచి సంస్కృతాన్ని అభ్యసించాలని సంస్కృత భారతి వర్గాధికారి ముద్రబోయిన రామచంద్రరావు అన్నారు. అద్దంకిలో నిర్వహిస్తున్న ఉచిత సంస్కృత శిబిరానికి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ సంస్కృతం లక్ష సంవత్సరాల నాడు పుట్టిందని వైజ్ఞానికులు తేల్చిచెప్పారన్నారు. గుప్తులు, శాతవాహనులు సంస్కృతాన్ని రాజభాషగా చేసుకున్నారన్నారు. విదేశీయులు సైతం సంస్కృతంపై ఆసక్తిని పెంచుకుని నేర్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు పీ. శ్రీరామచంద్రమూర్తి, తిమ్మసముద్రం ఓరియంటల్ కలాశాల విద్యార్థులు రామారావు, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వినియోగం నేరం



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఈఈలు

కారంచేడు: అక్రమంగా విద్యుత్‌ను వినియోగించడం చట్టరీత్యా నేరమని విద్యుత్ శాఖ చీరాల డీఈఈ టీ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడుతో పాటు అన్ని గ్రామాల్లో అక్రమ విద్యుత్ వినియోగంపై తనిఖీలు చేశామన్నారు. మొత్తం 33 టీంలుగా సిబ్బందిని నియమించామన్నారు. తనిఖీల్లో మొత్తం 78 అక్రమంగా అధిక లోడ్‌ను వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. 78 ఇళ్లపై కేసులు నమోదు చేశామని, వీరి నుంచి రూ. 5.78 లక్షల అపరాధ రుసుం వసూలు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఒంగోలు డీఈఈ టీ హైమావతి, వేటపాలెం డీఈఈ జే శ్రీనివాసరావు, పర్చూరు డీఈఈ ఎస్ రమేష్‌బాబు, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు ఈఓఆర్డీగా రాజు

తాళ్లూరు: మండల ఈఓఆర్డీగా కేజీఎస్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజు మార్టూరు మండల ఈఓఆర్డీగా పనిచేస్తూ బదిలీపై తాళ్లూరు వచ్చారు. తాళ్లూరు గ్రామ కార్యదర్శిగా జె.లక్ష్మీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మేదరమెట్ల కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై లక్ష్మీకాంత్ ఇక్కడకు వచ్చారు.

ఉన్నత పాఠశాలలకు కొత్త హెచ్‌ఎంలు

చినగంజాం: మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు కొత్తగా నిర్వహించిన ఉద్యోగుల బదీలల్లో నలుగురు కొత్తగా ప్రధానోపాధ్యాయులుగా చేరినట్ల ఎంఈవో డీ గంగాధర్ తెలిపారు. మండలంలో మొత్తం ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుండగా చినగంజాం, పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గతంలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు డీ రత్నకుమారి, ఎం దేవదత్తంలు కొనసాగుతుండగా కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీ సుధారాణి, రాజుబంగారుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు షేక్ కాలేషావలి, పల్లెపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఏ ప్రసాద్, అడివీధిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఏ మాధవీలతలు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. వీరు నలుగురు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలకు వచ్చి చేరినట్లు ఆయన తెలిపారు. కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బీ ప్రసన్నకుమారి బదిలీపై గవినివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లినట్లు తెలిపారు.

చందనాలంకారంలో వెంకటేశ్వరుడు



చందనాలంకారంలో స్వామివారు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం అద్దంకి రోడ్డులో కొలువైఉన్న వెంకటేశ్వరస్వామి 39వ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం వెంకటేశ్వరస్వామిని చందన అలంకారంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారిని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అనేక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆశించిన స్థాయిలో లేని దేశాభివృద్ధి

యర్రగొండపాలెం: స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలో ప్రజలు ఆశించిన మేరకు అభివృద్ధి జరగలేదని రచయిత తన కావ్యంలో వరించారని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీధర్‌నాయుడు అన్నారు. గురువారం ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథం రచించిన 'స్వతంత్ర భారతి' పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. తల్లి,కుమారుల సంభాషణ రూపంలో అందరికీ అర్థమయ్యే రూపంలో కావ్యాన్ని రచయిత ఆవిష్కరించారని పేర్కొన్నారు. రచయిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు ఆశించిన మేరకు దేశంలో మార్పు రాలేదని పేర్కొన్నారు. అనంతరం పుస్తక రచయిత దేవులపల్లి విశ్వనాథాన్ని ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు శ్రీనివాసాచార్యులు, రామకోటయ్య, ప్రదీప్, సుజాతమ్మ, శ్రీనివాసులు, విజయ నాయక్, వెంకటేశ్వరరెడ్డి, వల రాజు, రాజా నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

తాళ్లూరు: రైతులు ఆశించిన దిగుబడులు సాధించేందుకు, నేలలకు అనువైన నాణ్యమైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. శివరామపురంలో గురువారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. వరిలో బీపీటీ 2782 భవతి, బీపీటీ 2411 పరుంమ, ఎంటీయూ 1282, బీపీటీ 2295 బాపట్ల మసూరి, బీపీటీ 2776 రకాలు మంచి దిగుబడి ఇచ్చే రకాలను చెప్పారు. తక్కువ కాల పరిమితి కలిగి 120 రోజుల్లో పంట చేతికి వచ్చే రకాలైన ఎంటీయూ 1273 , 1295, 1275, ఎస్ఎల్ఆర్ 3354 ధాన్యరాశి, ఎంటీయూ 1121 శ్రీధృతి, ఎంటీయూ 1210, బీపీటీ 3082, ఎస్ఎల్ఆర్ 3238 రకాలు విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏవో ప్రసాదరావు చెప్పారు.

డంపింగ్ యార్డుల పరిశీలన

జే.పంగులూరు: డంపింగ్ యార్డుల ద్వారా పంచాయితీలకు లాభాలు రావాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రామకూరు డంపింగ్ యార్డును గురువారం మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ ప్రసాద్ పరిశీలించారు. డంపింగ్ యార్డు నిర్వాహణపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజినేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.